

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

### (కిందటి సంచికనుండి కొనసాగింపు)

**క్లాసులు పూర్తయ్యాక** వెన్నెల ఇంటికి వెళ్ళాను. హనీషతోపాటు ఆ చుట్టు పక్క ఇళ్ళవారందరూ ఉన్నారు. అంతా సెలవల గురించి మాట్లాడుకుంటున్నారు. ఎవరో ఇండియా నుండి వచ్చాక తను తెచ్చుకున్న పచ్చళ్ళని సూట్‌కేస్‌లో పెట్టి దానికి తాళం వేసారని ఒకతను చెప్పాడు. అదేంటి అని తెగ ఆశ్చర్యపోయాను. మరి తినడా? అని అడిగితే "తినేప్పుడు జాడీ తెస్తాడు. భోజనం అయిపోయాక మళ్ళీ సూట్‌కేస్‌లో పెడతాడు" అన్నారు.

సూట్‌కేస్‌ని ఫ్రిడ్జ్‌లా వాడుతున్నాడనమాట. ఇంతకీ ఎవరది అని అడిగితే అభిషేక్ అన్నారు. తెగ ఆశ్చర్యపడిపోయాను. నాకు బానే సహాయపడ్డాడు, మంచి అబ్బాయిలానే అనిపించాడు కానీ ఇంత కక్కుర్తి అని గ్రహించలేదు. ఇక్కడ చాలామంది అలానే ఉంటారని హనీష చెప్పింది.

"నా రూమ్మేట్ అయితే నేను మూడు వారాలు లేనుకాబట్టి కేవలం ఒక్క వారానికే రెంట్ కడతా అని కూర్చున్నాడు" విజయ్ చెప్పాడు.

"మా వాడైతే పికిల్స్, కెచప్, ఆఖరికి మంచినీళ్ళ బాటిల్ మీద కూడా మార్కర్‌తో ఎంత వరకు అయిందో అక్కడ ఒక గీత గీస్తాడు .ఆ గీత కన్నా తగ్గినా, తగ్గినట్టు అనిపించినా రాద్దాంతమే" మరొకరు చెప్పారు.

"మా రూములో ఇద్దరూ వెరైటీ రకాలు. రాత్రి కూర నేను తినలేదు కాబట్టి టొమాటోలకి నేను కట్టింది తిరిగి ఇచ్చేయ్ అంటారు. విడిగా వండుకుందాం ఎవరి దారి వారిది అంటే మాత్రం స్నేహం పొంగి పోతుంది" అని మరొకరు.

"అహ నా పెళ్ళంటలో కోటా శ్రీనివాస్‌రావులా ఉన్నారుగా అందరూ" అన్నాను.

అందరూ నవ్వారు. "వెన్నెల, నీకు హనీష్‌కి మంచి రూమ్మేట్స్ కాబట్టి మీరు బతికిపోయారు" అన్నాను.

"లేదమ్మా నాకు చాలా హారిబుల్ రూమ్మేట్ ఉండేది. వాళ్లందరినీ కలిపితే తను జాబ్ వచ్చాక రూమ్మేట్ వద్దనుకున్నాను కానీ హనీష కాబట్టి ఊరుకున్నాను" అంది వెన్నెల.

"అవునా? ఎవరు?" అడిగాను.

"తను ఇప్పుడు లేదు ఇక్కడ. గ్రాడ్యుయేట్ అయి వెళ్ళిపోయింది. మరో కొత్తమ్మాయితో ఫోన్ ప్లాన్ జాయిన్ అయ్యింది. డేటా అయిపోతుందని తనకి తెలియకుండా అకౌంట్‌లోకి  లాగిన్ అయ్యి డేటా ఆఫ్ చేసేది. తనకి తెలిసాక పెద్ద గొడవయ్యింది. గట్టిగట్టిగా అరుచుకున్నారు. చుట్టుపక్కల ఇండియన్సే కాబట్టి బానే వుంది కానీ అమెరికన్స్ ఉంటే పక్కా కంప్లైంట్ చేసేవారు" అంది.

"ఇంకా ఏం చేసింది?" హనీష అడిగింది.

"ఎప్పుడైనా ఎవరైనా వస్తే రాత్రి ఇక్కడే తినేవాళ్ళు. వాళ్ళముందే 'వీళ్ళు స్ప్లిట్ చేస్తారా తినేదానికి డబ్బులు' అని నన్ను అడిగేది. కొన్ని రోజులకి ఎవరూ రావడం మానేసారు."

"ఎవరూ కాదు అందరు" రవి సరిచేసాడు.

"ఏదో ఒకటిలే. అర్థం తెలిసిందిగా, అది చాలు" అన్నాను.

"ఇంకేం చేసేది?" అంతా అడిగాం.

"ఒకరోజు గోంగూర పచ్చడి తింటుంటే ఉల్లిపాయ ముక్కలు తెచ్చి ఇచ్చింది. తెగ ఆశ్చర్యపడిపోయాను. ఇంత మంచిది ఎప్పుడైందని నమ్మలేకపోయాను. కానీ నాకు తెలిసి అప్పుడు ఇంట్లో ఉల్లిపాయలు అయిపోయాయి. 'ఎక్కడిది?' అని తింటూ అడిగాను. 'సింక్ పక్కన ఉంది' అని చెప్పింది. వాంతి చెయ్యడం ఒక్కటే తక్కువైంది నాకు."

"ఏ? ఎందుకు?"

"దీనికి రెండు రోజుల ముందు ఉల్లి దోస తినాలనిపించింది. కానీ ఒకే ఉల్లిపాయ ఉండడంతో ఒక సగం పిండిలో కలిపా, మరో సగం పెనం మీద ఘాటు కోసం ప్రతి దోస ముందు రాసాను. ఆ మిగిలిన చెక్కని పడేయకుండా బాక్టీరియా అబ్సార్బ్ చేస్తుందని సింకు పక్కన పెట్టాను. దాన్ని ముక్కలు చేసి ఇచ్చింది మహాతల్లి" అంది.

తన గొంతులో ఇంకా కోపం తెలిసింది .అందరం ఛీ...ఛీ...ఛీ అనుకున్నాము. ఇంతలో నెమ్మదిగా స్నో మొదలైంది. దాంతో ఎవరింటికి వారు బయలుదేరారు. నేను కూడా వెళ్తానని బయలుదేరబోయిన నన్ను "నేను డ్రాప్ చేస్తాలే" అని విజయ్ అనడంతో మేము నలుగురం ఇంకాస్తసేపు అక్కడే ఉన్నాం.

"రవి వాళ్ళ అమ్మ తెలుగు టీచర్" అన్నాడు విజయ్.

"అయితే?" నేను, హనీష ఒకేసారి అడిగాము.

"చిన్నప్పటినుండి వాడికి ఇంట్లో కూడా తెలుగు పాఠాలే. కొత్త సినిమాలు కూడా చూడనిచ్చేది కాదట. పిచ్చి భాష అంటుకుంటుందేమో అని. అప్పుడు వాళ్ళ అమ్మలా ఇప్పుడు తనుకూడా తయారయ్యాడు. కానీ మంచివాడే. ఏం అనుకోకండి" అన్నాడు.

"వాళ్ళ అమ్మ తెలుగు టీచర్ అయితే అమెరికాకి వచ్చి మా తెలుగు సరిచెయ్యాలా?" హనీష కోపంగా అడిగింది.

"తన ఫ్రెండ్స్ ఎప్పుడైనా ఇంటికి వచ్చినప్పుడు పిచ్చి తెలుగు మాట్లాడితే వాడిని తిట్టేదట. ఇంకోసారి వాళ్ళతో మాట్లాడితే నాలుక మీద వాత పెడతా అని బెదిరించేదట. దాంతో బాగా డిస్టర్బ్ అయ్యాడు" అన్నాడు.

నేను బాగా జాలి పడ్డాను.

"థెరపీ తీసుకోవాలి పాపం" వెన్నెల అంది.

"కొన్ని చిన్నప్పటి సంఘటనలు థెరపీ తీసుకున్న పోవు వెన్నెల" అన్నాడు. అంతా నిశ్శబ్దంగా ఉన్నాము.

"పాపం వాడు టెంత్ లో ఉన్నప్పుడుకూడా టీచర్‌తో దెబ్బలు తిన్నాడు" అన్నాడు.

"అయితే?" అని హనీష,

"ఎందుకు?" అని నేను అన్నాము.

"టెంత్ లో దెబ్బలు తిన్నాడా" అని వెన్నెల నవ్వింది.

"నవ్వకు వెన్నెల. వాడప్పుడు చాలా బాధపడ్డాడు" అనడంతో ముగ్గురం నవ్వాము.

"టీచర్ వాడితో మాట్లాడుతూ బాటనీలో బానే మార్కులు వచ్చాయి కానీ జువాలజీలో తగ్గాయని తిడుతూ 'మీ అమ్మా నాన్నని తీసుకునిరా, వాలతో మాట్లాడతా' అన్నారట. వీడు అలవాటులో పొరపాటు 'వాలతో కాదు వాళ్ళతో' అన్నాడట. దాంతో ఆ టీచర్ స్కేల్ విరిగేంత వరకు కొట్టిందట."

నాకు జాలి పెరిగింది.

"స్నో పెరిగేట్టు ఉంది. వెళ్దామా?" అడిగాడు.

సరే అని ఇద్దరం బయలుదేరాము. కారు ఎక్కుతుండగా "నీకు రాప్ ఇష్టమా?" అడిగాడు.

"నేను ఇంగ్లీష్ పాటలు పెద్దగా వినను" అన్నాను.

"ఇంగ్లీష్ కాదు. తెలుగే అన్నాడు."

"ఏమో. నేను ఎప్పుడూ వినలేదు" అన్నాను.

ఈలోగా తను పెట్టిన పాట కాస్త ప్రార్ధనలా అనిపించి అడిగాను.

"ఇది మన నోయెల్ పాట. తన వాటిల్లో బైబిల్ రిఫరెన్సులు ఉంటాయి. కానీ చాలా తక్కువమంది అది గ్రహిస్తారు. నిజంగా నువ్వు ఇది వరకు వినలేదా?" అడిగాడు.

"వినలేదు. నోయెల్ అంటే నీ ఫ్రెండా?" అమాయకంగా అడిగాను.

"లేదు. ఈగ సినిమాలో అతను" నవ్వాడు.

పాట పూర్తయ్యేలోగానే ఇల్లు చేరాను. తనకి థాంక్స్ చెప్పి లోపలికి వెళ్ళాను. నేహ పాటలు వింటూ వంట చేస్తోంది. సహాయం కావాలా అని మాట వరసకి అడిగాను కానీ తను వెంటనే పనులు చెప్పింది. తను వాళ్ళ అమ్మ చేసే ఉకడిచె మోడక్ చేస్తున్నా అంది. అంటే ఏంటో నాకు తెలీదంటే చాలా ఆశ్చర్యపోయింది. అది డంప్లింగ్‌లాంటిదని, పిండి సరిగ్గా కలపకపోతే విరిగిపోతుందని చెప్పింది. నిజానికి అది స్వీట్ అట. అందులో కొబ్బరి, జీడిపప్పులాంటి పదార్ధాలు వేసి వినాయకుడికి నైవేద్యం పెట్టే వంటకం అట. కానీ వాళ్ల అమ్మమ్మ అందులో సెనగపిండిలో కారెట్, వగైరా గ్రేట్ చేసి వేసేదట. ఆవిడకి చక్కెర వ్యాధి ఉండడంతో రెసిపీని పూర్తిగా మార్చి రుచిగా కారంగా చేసేదట. అది ఇవాళ్ళ తను చేసే ప్రయత్నంలో ఉందని చెప్పింది. నేను కారెట్ గ్రేట్ చేస్తుంటే తను పిండిలో పాలు వేసి కలిపింది.

'అదేంటి? కారంలో పాలు' అని అడిగాను .

ఆ పిండి పల్చగా ఎలాస్టిక్‌గా ఉండడానికి పాలు కంపల్సరి అని చెప్పింది. ఆశ్చర్యపోయాను. ఆ తరవాత సెనగపిండిలో కాస్త నీరు, కాస్త నెయ్యి వేసి కలపమంది. అది దాదాపు ముద్దలా అయ్యాక అందులో కారెట్, ఉడకపెట్టిన బఠానీలు, సన్నగా తరిగిన పచ్చిమిర్చి, కొద్దిగా కొబ్బరి, వెల్లుల్లి వేసి కలపమంది. అదంతా ఉండలా తయారయ్యాక కాస్త ఉప్పు, కొంచెం కారం, ఆమ్ చూర్ పౌడర్ ఇంక జీరా పౌడర్ వేసి మళ్ళీ కలపమంది. అయిదు నిమిషాలపాటు కలిపాక రుచి చూసి ఇంకాస్త నెయ్యి వేసింది. ఆ తరవాత కలిపిన బియ్యపిండిని రౌండుగా చేసి అందులో ఒక స్పూన్ కలిపిన సెనగపిండి పెట్టి గుండ్రంగా తిప్పింది. మొదటి రెండు విరిగిపోవడంతో అసహనంగా మూడోది కూడా విరక్కొట్టింది. ఆ తరవాత ఒక్క క్షణం నన్ను చూసి "దిస్ టైమ్ ఐ విల్ బీ పేషెంట్' అని పిండిని చాలాసేపు మర్దనా చేసాక అప్పుడు మళ్ళీ మొదలు పెట్టింది. అది అంతా చుట్టాక పదకొండు మడతలు లెక్కపెట్టింది. అదేంటంటే 'ఉంటే పదకొండు, లేదా ఇరవై

ఒకటి మడతలు' ఉండాలని చెప్పింది .ఆ లెక్క ఎలా వచ్చిందో ఇద్దరికీ తెలీలేదు. మొదటిది చేసాక తన ముఖం ఆనందంతో పొంగిపోయింది. నాకు ఎంత ప్రయత్నించినా రాకపోవడంతో కేవలం కబుర్లు చెప్పసాగాను. అంతా పూర్తయ్యాక ఫోటో తీసి వాళ్ళ అమ్మమ్మకి పంపి, దాన్నే ఇన్స్టా గ్రామ్ లో పెట్టింది. ఆ తరవాత మొదటిది మేము రుచి చూసాక ఇద్దరి సెల్ఫీ తీసి పెట్టింది. నా ఫోన్‌లో నుండి తనే ఆ ఫోటో టాగ్‌ని అకౌంట్‌కి ఆడ్ చేసింది. అలా చెయ్యచ్చని అప్పటిదాకా నాకు ఎలీదు.

ఆ వింత వంటకం ఎంతో రుచిగా ఉంది. సన్నటి పచ్చిమిరపకాయ ముక్క పంటికింద పడినప్పుడు ఆ కొబ్బరి, ఇంకా బయట ఉన్న బియ్యప్పిండి గొంతుకి హాయిగా అనిపించాయి. ఎంతో రుచిగా, కడుపు నిండేలా ఉన్నాయి. నాలుగు తినేసరికి ఆత్మారాం శాంతించాడు.

అందులోని సెనగపిండి వల్ల ప్రొటీన్‌తో కడుపు త్వరగా నిండిపోతుందని, బియ్యప్పిండి వల్ల కార్బోహైడ్రేటు, కారెట్, బఠానీ, కొబ్బరి వల్ల విటమిన్లు వస్తాయని వివరించింది. వాళ్ళ అమ్మమ్మ తండ్రి డాక్టర్ కావడంతో ఆవిడ ఇలాంటి చిట్కాలు ఎన్నో పాటిస్తారట. అవి తనకి చిన్నప్పటి నుండి నేర్పడంతో వంట చేసిన ప్రతిసారి అలాగే ఆలోచిస్తానని చెప్పింది.

మా అమ్మమ్మ వాళ్ళకి ఇంత అవేర్నెస్ లేదని, ఎంత లావుగా దట్టంగా ఉంటే అంత ఆరోగ్యంగా ఉన్నారనుకునేవాళ్ళని చెబితే ఎంతో ఆశ్చర్యపోయి నమ్మలేదు. ఫోన్‌లో ఉన్న ఫ్యామిలీ ఫోటో చూపిస్తే అప్పుడు నమ్మింది. అందరిలో మా అమ్మ నాజూకుగా ఉండడం వల్ల నాకు మంచి పోలికలు వచ్చాయని చెప్పింది వాళ్ళ నాన్న పూర్వీకులు రాజుల దగ్గర పనిచేయడంతో అధికంగా భోజన ప్రియులుగా మారారని చెప్పింది. ఆ రెండిటికి సంబంధం అర్థంకాలేదు కానీ తలుపాను. కిచెన్ క్లీన్ చేసి మిగిలినవి జిప్‌లాక్ బ్యాగ్‌లో పెట్టి ఫ్రిడ్జ్‌లో సర్దిన వెంటనే నేను భుక్తాయాసంతో నిద్రలోకి జారుకున్నాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story